

గెడ్డల్లో పూడిక తొలగింపు



సీతమ్మధార గెడ్డలోని వ్యర్థాలను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 14, 24 వార్డుల్లోని గెడ్డల్లో పెద్ద ఎత్తున పేరుకుపోయిన పూడికలను గురువారం సీఎంహెచ్‌వో, అధికారుల ఆదేశాల మేరకు పారిశుధ్య కార్మికులు తొలగించారు. సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ ఎదురుగా గెడ్డ, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ వెనుక గెడ్డ, చిన్న కాలువలు, రేసపువానిపాలెం గెడ్డల్లోని వ్యర్థాలను పొక్లెయిన్‌తో తొలగించి శుభ్రం చేశారు. సీతమ్మధార, ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌కు అనుకుని ఉన్న గెడ్డలో ప్లాస్టిక్ బాటళ్లు, చెత్తాచెదారంతోపాటు మురుగు నీరు నిలిచిపోవడంతో మొత్తం క్లియర్ చేశారు. గెడ్డల్లో వ్యర్థాలను పడవేస్తున్న తోపుడు బళ్లు, టిఫిన్ షాపుల నిర్వాహకులను అధికారులు హెచ్చరించారు.

నేడు సహస్ర ఘటాభిషేకం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కార్తీక బహుళ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఈవో శేఖర్ బాబు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 1008 బిందెలతో జలాభిషేకం చేస్తామన్నారు. మధ్యాహ్నం నుంచి మృత్యుంజయ హోమం జరుగుతుందన్నారు. భక్తులు స్వహస్తాలతో శివలింగానికి జలాభిషేకం చేస్తారని చెప్పారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు.

సీతమ్మధార రైతుబజార్ స్టాళ్లకు డ్రా



స్టాల్ టోకెన్ అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు గురువారం ఈవో కొండబాబు ఆధ్వర్యంలో డ్రా తీసి రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 66 మంది రైతులకు స్టాళ్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

శాడిస్ట్ భర్తకు నాలుగు నెలల జైలు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కార్మికవాడకు చెందిన కాపు మోహన్‌రావు అనే వ్యక్తికి భీమిలి 15వ అదనపు మేజిస్ట్రేట్ నాలుగు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్టు భీమిలి సీఐ డి.రమేష్ గురువారం తెలిపారు. 2019లో మోహన్‌రావు తనను శారీరంగా, మానసికంగా హింసించినట్టు భార్య పావని భీమిలి పోలీసుకు ఫిర్యాదు చేసింది. పెంకుతో తలపై కొట్టడంతో అప్పట్లో ఆమె తీవ్రంగా గాయపడింది. హెచ్‌సీ కాంతారావు దర్యాప్తు చేసి వివరాలు న్యాయమూర్తి ముందు వుంచడంతో ఆమె పైవిధంగా తీర్పు చెప్పారు. పావనికి భర్త మోహన్‌రావు రూ.2వేలు నష్టపరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది.






























క్లుప్తంగా

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : సహస్రాది తులసీదళాల నడుమ సిరులతల్లి కనకమహాలక్ష్మి నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం సహస్ర తులసిపూజను శాస్త్రోక్తంగా జరిపించారు. పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 0608100 11006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో పూజా రుసుం చెల్లించాలని ఈవో శిరీష తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న కేజీహెచ్ ఆర్ఎంవోలు డాక్టర్ లక్ష్మీతులసి, డాక్టర్ జగదీష్

మహారాణిపేట : రోగులకు మెరుగైన సేవలందించాలని, అన్ని విభాగాల ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలని కేజీహెచ్ ఆర్ఎంవోలు డాక్టర్ లక్ష్మీతులసి, డాక్టర్ జగదీష్‌కుమార్ తెలిపారు. గురువారం కేజీహెచ్‌లోని అన్ని వార్డుల హెడ్ నర్సులు, ఐసీయూ వార్డుల స్టాఫ్ నర్సులు, సీనియర్ నర్సులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీతులసి మాట్లాడుతూ రోగులకు అందించే సేవల విషయంలో రాజీ పడరాదన్నారు. ఈ విషయంలో ఎటువంటి సమస్యలున్నా తమకు, డైటీషియన్‌కు తెలియజేయాలన్నారు. క్యాజువాల్టీ, ఓపీ, ఇతర అత్యవసర విభాగాల్లో పని చేసేవారు, ఐసీయూ వార్డుల్లో విధులు నిర్వర్తించేవారు బాధ్యతగా పని చేయాలని ఆర్ఎంవో డాక్టర్ జగదీష్ తెలిపారు. గ్రేడ్–1, 2 నర్సింగ్ సూపరింటెండెంట్లు జె. విజయలక్ష్మి, కల్పనామౌళి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

10న వస్తు ప్రదర్శన

ఆరిలోవ: దయాల్‌బాగ్ వస్తు ప్రదర్శన ఈ నెల 10న జరగనుందని దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాలాక్షినగర్ ప్రాంతం దయాల్‌నగర్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు వస్తు ప్రదర్శన ప్రారంభించనున్నట్లు తెలిపారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో పవిత్రోత్సవాలు



పవిత్రాలను సమర్పిస్తున్న దాతలు



వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో గురువారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం భక్తులు ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం 5 గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలభోగం, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. 9 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మత్స్యంగ్రహణం, అగ్నిప్రతిష్ఠ, అంకురార్పణ, ధ్వజారోహణం, చక్రబ్జమండల రచన, మంగళాశాసనం జరిపారు. సాయంత్రం 6 గంటలకు మండపారాధన, మండలార్చన, పవిత్రాధివాసం, దేవతావాహనలు, విశేష హోమాలు, బలిహారణ, మంగళాశాసనం, తీర్థగోష్ఠి నిర్వహిటించారు. దాతలు సురేష్–సరిత దంపతులు, నాగరాజు–మాధురి దంపతులు స్వామికి పవిత్రాలను సమర్పించారు. ఆలయం అర్చకుడు శేషాచార్యుల ఆధ్వర్యంలో సంప్రదాయ సిద్ధంగా పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు సత్యనారాయణ స్వామి వ్రతం

కార్తీక బహుళ ద్వాదశి శనివారం రోజున శ్రీవారిని పవిత్రాలతో అలంకరించి ఐదు రోజులు పాటు భక్తులకు స్వామి దర్శనాన్ని కల్పిస్తారు. స్వామి సన్నిధిలో త్రయాహ్నిక దీక్షతో పాంచరాత్ర దివ్య ఆగమ విధానంలో ఉత్సవాలు ప్రారంభించారు. బహుళ ఏకాదశి శుక్రవారం సామూహికంగా శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రత మహోత్సవం నిర్వహిస్తామని ఈవో చెప్పారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం వలంటీర్లను ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత గురువారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల కోల్‌కతాలోని జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని వచ్చిన విద్యార్థులను ఆమె తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో వీసీ ఆచార్య కె.సమత

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

ఎంవీపీ స్టేషన్‌లో సీపీ ఆకస్మిక తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్‌ను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ గురువారం సందర్శించారు. లా అండ్ ఆర్డర్‌తో పాటు క్రైమ్ స్టేషన్లను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేయడంతో పాటు సిబ్బంది పనితీరు, ఫిర్యాదుల పరిష్కారంపై ఆరా తీశారు. స్టేషన్ పరిధితో పాటు క్రైమ్ రేట్ ఎక్కువగా ఉండే ప్రాంతాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలతో పాటు పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల విషయంలో పూర్తి స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. బాలికలపై అఘాయిత్యాల కేసుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలన్న ఆయన మాదక ద్రవ్యాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యాటకుల రక్షణలో భాగంగా ఎంవీపీ కాలనీ పరిధిలోని అప్పుఘర్ అవుట్ పోస్ట్ నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ పర్యటనలో డీసీపీ–2 ఆనందరెడ్డి, సీఐ సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా, సేవా శిక్ష

ఆనందపురం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి భీమిలి న్యాయస్థానం జరిమానా, సామాజిక సేవ శిక్ష విధించారని ట్రాఫిక్ ఎస్ఐ అప్పలరాజు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 65 మందిని భీమిలి 15వ అదనపు మెట్రో పాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు గురువారం హాజరు పరిచారు. ఈ మేరకు న్యాయమూర్తి జి.విజయలక్ష్మి ఒక్కొక్కరికి రూ.వేయి చొప్పున జరిమానాతోపాటు సామాజిక సేవ కింద పరిసరాలను పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు వారు ఏఎంజీ పాఠశాలలో, ఇండోర్ స్టేడియంలో చెత్త తొలగించారు.

గౌరమ్మకు సారె సమర్పణ

అల్లిపురం : వేంకటేశ్వరమెట్టపై శ్రీ వేంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం, గౌరీ మహిళా మండలి, గౌరీ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారికి గురువారం సారె అందజేశారు. ఈ సందర్భంగా గౌరీ మహిళా మండలి అధ్యక్షురాలు కర్రి వరలక్ష్మి, కార్యదర్శి కాండ్రేగుల కుమారి, కోశాధికారి భీశెట్టి అనురాధ, సహాయ కోశాధికారి కొణతాల నూకాలమ్మ ఆధ్వర్యంలో యువజన సమాజం నుంచి నీలమ్మ వేపచెట్టు, ఎంజీఎం హైస్కూల్ మీదుగా వేంకటేశ్వరమెట్ట వరకు మేళతాళాలతో అమ్మవారికి పసు పు, కుంకుమ, అరటి పండ్లు, చీ ర, జాకెట్టు, గాజులు, పలు రకాల స్వీట్లతో కూడిన సారె సమర్పించారు.

పార్కింగ్ కష్టాలకు చెల్లు!


ప్రభుత్వ స్థలంలో వాహనాల పార్కింగ్ కోసం నిర్మించిన రోడ్డు


సీతమ్మధార రైతుబజార్ వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు


ఇది కదా అభివృద్ధి


24వ వార్డు నక్కవానిపాలెంలో ఏర్పాటు చేసిన ఆకర్ష జోన్

- నక్కవానిపాలెంలో ఆకర్ష జోన్ ఏర్పాటు
- వాహనాల ఫ్రీ పార్కింగ్‌కు రహదారి నిర్మాణం
- స్థానికులు, వాహన చోదకుల హర్షం

సీతమ్మధార: స్మార్ట్ సిటీగా ఎదుగుతున్న విశాఖ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందుకనుగుణంగా జీవీఎంసీ తగు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. ఇప్పటికే నూతన రహదారుల నిర్మాణం, విస్తరణ, బస్ బేల ఆధునికీకరణ జోరుగా చేపడుతుంది. ముఖ్యంగా వాహనాల పార్కింగ్ సమస్య లేకుండా ఆకర్ష జోన్ పేరిట ఫ్రీ పార్కింగ్ జోన్లు నిర్మిస్తోంది. ఇందులో భాగంగా జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో రూ.48 లక్షల నిధులతో ఆకర్ష జోన్ నిర్మించింది. సీతమ్మధార మండల అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలంలో వాహనాల ఫ్రీ పార్కింగ్ కోసం రహదారి నిర్మాణం చేపట్టింది. ఈ పనులు పూర్తి కావడంతో వాహనాల పార్కింగ్‌కు ఆకర్ష జోన్ ఎంతగానో ఉపయోగపడుతోంది.

జీవీఎంసీ అధికారుల చర్యలతో..

సీతమ్మధార రైతుబజార్ వద్ద ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉంటోంది. రైతుబజార్ ఆవరణలో ఎప్పుడు చూసినా ద్విచక్ర వాహనాలు, ఆటోలు బారులు తీరి కన్పిస్తుంటాయి. ఒక్కోసారి బజార్‌లోకి వినియోగదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. ఇక్కడ వాహనాల పార్కింగ్‌కు సదుపాయం లేకపోవడం వల్ల నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంటుంది. రైతుబజార్‌కు వచ్చే వినియోగదారులు, వ్యాపారులు, ఇతర పనుల మీద వచ్చే వారు తమ వాహనాలను రోడ్డు మీదే నిలుపుతుంటారు. రైతుబజార్ పరిసరాల్లో, రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన తోపుడు బళ్లు, చిరువ్యాపారుల దుకాణాల ముందు ద్విచక్ర వాహనాలను నిలిపి వదిలేస్తున్నారు. తద్వారా ఇతర వాహన చోదకులకు ట్రాఫిక్ తంటాలు తప్పడం లేదు. ఈ సమస్యను గుర్తించిన జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా నక్కవానిపాలెంలో ఆకర్ష జోన్ నిర్మించారు. ఈ ప్రదేశం అన్ని రకాల వాహనాల పార్కింగ్‌కు అనువుగా మారింది. ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు కూడా తగ్గాయి. ఫ్రీ పార్కింగ్ జోన్ ఏర్పాటుపై వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా రహదారి విస్తరణ పనులు

సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార అల్లూరి సీతారామరాజు కూడలి వరకు రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీనిని 80 అడుగులు రోడ్డుగా విస్తరిస్తున్నారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు ఈ పనులు ప్రారంభించారు. నక్కవానిపాలెంలో విస్తరణ పనులు ఊపందుకున్నాయి. ఇక్కడ రూ.12 లక్షల నిధులతో ప్రస్తుతానికి డ్రైనేజీలు, గోడల నిర్మాణాలు పూర్తి చేశారు. పొక్లెయిన్‌తో రోడ్డు వెడల్పు చేశారు. రహదారులకు ఇరువైపులా కల్వర్టులపై కప్పులు వేస్తున్నారు.


నక్కవానిపాలెంలో జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులు


రహదారి విస్తరణలో భాగంగా గాంధీనగర్‌లో చేపడుతున్న కాలువ పనులు

రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు

- సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార అల్లూరి సీతారామరాజు కూడలి మీదుగా వెంకోజీ పాలెం వరకూ సుమారు రూ.5 కోట్ల నిధులతో రహదారి విస్తరణ పనులు, డ్రైనేజీలు, కాలువలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణాలు చేపడుతున్నారు.
- నక్కవానిపాలెంలో రూ.60 లక్షలతో అభివృద్ధి పనుల పూర్తి.
- రూ.48 లక్షలతో ఆకర్ష జోన్ ఏర్పాటు.
- రూ.12 లక్షలతో డ్రైనేజీలు, గోడల నిర్మాణాలు.
- శరవేగంగా జరుగుతున్న విస్తరణ పనులు.

పార్కింగ్ కష్టాలు తీరాయి



జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఆకర్ష జోన్‌తో కొంతమేర పార్కింగ్ కష్టాలు తీరాయి. సీతమ్మధార, నక్కవానిపాలెం ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్క్‌చేయడంతో ట్రాఫిక్ సమస్య నెలకుంటోంది. ఆకర్ష జోన్ ఏర్పాటుతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు తొలగాయి.

– రమణమూర్తి, నక్కవానిపాలెం

శరవేగంగా అభివృద్ధి పనులు



24వ వార్డులో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో కానరాని అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కనిపిస్తోంది. ముఖ్యంగా మౌలిక సదుపాయల కల్పనకు పెద్దపీట వేశారు. రహదారులు, కాలువలు, డ్రైనేజీల నిర్మాణం జోరుగా సాగుతోంది. సీఎంకు ధన్యావాదాలు

– నక్క రాజశేఖర్‌రెడ్డి, నక్కవానిపాలెం

క్లుప్తంగా

‘గ్రీవెన్స్’తో సమస్యల పరిష్కారం


ప్రజా వినతులు పరిశీలిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. మరికొన్ని అర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల విరాళాలతో శివుడికి ఆభరణాలు


నాగాభరణం, జఠాధరం అందజేస్తున్న మోహన్, వేణు తదితరులు

సీతంపేట: కార్తీక మాసం సందర్భంగా పలువురు భక్తులు ఇచ్చిన రూ.63 వేల విరాళాలతో అక్కయ్యపాలెం మూడుగుళ్ల వద్ద గల షిర్డీసాయి ఈశ్వరాలయంలో ఈశ్వరుడికి ఇత్తడి తొడుగు, జఠాధరం, నాగాభరణం తయారు చేయించారు. వీటిని గురువారం ఆలయ కమిటీ అధ్యక్షులు బొడ్డేటి మోహన్‌రావు, శ్రీదేవి దంపతులు, ఆలయ చైర్మన్ కొయిలాడ వేణుగోపాల్ చేతుల మీదుగా అర్చకులకు అందజేసారు. దీనికి రూ.18 వేలు విరాళాలు ఎక్కువ మొత్తంలో అందజేసిన యల్లపు అప్పలరాజు, వాసు, కోటేశ్వరరావులను అభినందించారు. కార్యక్రమంలో అర్చకులు భమిడిపాటి విజ్ఞేశ్వకిరణ్ శర్మ, మేడూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.5 లక్షలతో సులభ్ కాంప్లెక్స్ ఆధునీకీకరణ


శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార అంబేడ్కర్ కాలనీలోని సులభ్ కాంప్లెక్స్ ఆధునీకరణకు గాను జీవీఎంసీ రూ.5 లక్షల నిధులు కేటాయించింది. ఈ పనులకు గురువారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ కొబ్బరికాయ కొట్టిన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు అభివృద్ధి కోసం పలు పనులు చేపట్టామని వివరించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జోన్-5 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, ఎమినిటీస్ కార్యదర్శి అలేఖ్య, వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్యామ్, స్థానికులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్

సింహాచలం: పాత గోశాల నుంచి వేపగుంట వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డులో గురువారం పెనుప్రమాదం తప్పింది. పాత గోశాల నుంచి వేపగుంట వైపు వెళ్తున్న కారు అతి వేగంతో వచ్చి రోడ్డుకి ఎడమ వైపు ఉన్న విజయ్ హెలీనా ఆస్పత్రి వద్ద పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. అలాగే అక్కడే ద్విచక్ర వాహనం పార్క్‌చేసి కూర్చున్న తల్లి, కుమారుడిని ఢీకొట్టింది. దీంతో తల్లి భవానీకి గాయాలయ్యాయి. ప్రమాదంలో ఒక బైకు బాగా దెబ్బతింది. గాయాలపాలైన భవానీని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

మహిళలు, వృద్ధుల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్
- కంచరపాలెం పోలీస్ స్టేషన్ సందర్శన


వృద్ధుల ఫిర్యాదులను పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్

మర్రిపాలెం: మహిళలు, వృద్ధుల ఫిర్యాదులపై పోలీసులు సత్వరమే స్పందించి పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ ఆదేశించారు. కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. స్టేషన్‌లో సిబ్బంది పనితీరుని పరిశీలించారు. ఆ సమయంలో స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారంలో సిబ్బందికి సీపీ సూచనలు, సలహాలు ఇచ్చారు. ఐదో పట్టణ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేయడం విశేషం. సీపీ రవిశంకర్ వెంట డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆనందరెడ్డి, ఐదో పట్టణ సీఐ ఎన్.సాయి, అదనపు ఎస్ఐ సతీష్, ఇతర సిబ్బంది ఉన్నారు.

‘శివానందలహరి’ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, సాహితివేత్తలు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కవి కర్రా ప్రసాదరావు అనువదించిన శివానంద లహరి పుస్తకావిష్కరణ జరిగింది. ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్తోత్రరచన అనువదించినపుడు భక్తి, భావ పోషణ ప్రాధాన్యం వహిస్తుందన్నారు. శివానంద లహరి అనువాదాలు చాలా వచ్చాయని, కర్రా ప్రసాదరావు అనువాదం గేయ రూపంలో అలరించిందన్నారు. ఆచార్య అక్కుబొట్ల శర్మ పుస్తక సమీక్ష చేశారు. శేఖరమంత్రి ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆచార్య బాలమోహన్‌దాస్, కె.జి.వేణు, ఎస్.విజయ్‌కుమార్, చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో మహారుద్రాభిషేకం


శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం మహా రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు పర్యవేక్షణలో కార్తీక మాసం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఉదయం 5.15 గంటల నుంచి కాగడా హారతి, భక్తుల స్వహస్తాలతో పాలు, పంచామృతాభిషేకాలు, నదీ జలాలతో బాబాకు అభిషేకం జరిగాయి. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శివలింగానికి మహారుద్రాభిషేకం చేశారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మహా అన్నప్రసాదం, సాయంత్రం 6.15 గంటల నుంచి సంధ్యాహారతి, రాత్రి 7.30 గంటల నుంచి పల్లకీ మహోత్సవం, 9 గంటల వరకు బాబా భజన, అనంతరం శేజ్ హారతితో కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

పల్లవానిపాలెంలో పట్టపగలే చోరీ


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్ సభ్యులు


ఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

సబ్బవరం: మండలంలోని గాలిభీమవరం శివారు పల్లవానిపాలెంలో గురువారం పట్ట పగలే చోరీ జరిగింది. ఏడు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.50 వేలు నగదు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పల్ల నాగరాజు(34) సోదరుడు నర్సింగరావు అయ్యప్ప మాల వేశారు. గురువారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇరుముడులు కార్యక్రమం జరుగుతుంది. దీంతో కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి ఆ కార్యక్రమం వద్దకు వెళ్లారు. మరోవైపు పక్క వీధిలో వివాహం జరుగుతుండడంతో గ్రామంలో హడావిడిగా ఉంది. అదే అదునుగా చూసుకుని గుర్తు తెలియని వ్యక్తులు.. నాగరాజు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువా తాళం విరగ్గొట్టి లోపల ఉన్న ఏడు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.50 వేలు నగదు అపహరించుకుపోయారు. ఇంటిని ఆనుకుని ఉన్న నాగరాజు సోదరుడు ఇంటి తాళం కూడా పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా తాళం పగల గొట్టి వెతుకుతుండగా.. ఇంటి గేటు తీసిన శబ్దం వినిపించడంతో ఇంట్లోకి వస్తున్న నర్సింగరావు కుటుంబ సభ్యులను తోసుకుని దొంగలు పరారయ్యారు. స్థానికులు గమనించి వెంబడించినా ప్రయోజనం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సీఐ రంగనాథం, ఎస్ఐ వెంకటేశ్వరరావు తమ సిబ్బందితో వెళ్లి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి వివరాలను సేకరించారు. బాధితుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రంగనాథం తెలిపారు. నర్సింగరావు ఇంట్లో ఎటువంటి వస్తువులు పోలేదని సీఐ తెలిపారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాల్తేర్ డివిజన్ అధికారులు

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాపరినిర్వాణ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి, ఇతర సిబ్బంది భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు పుష్పాంజలి ఘటించారు. ఆయా సబ్ డివిజనల్ కార్యాలయాల్లో కూడా బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ నెల 6న కేకే లైన్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రదేశంలో వీరంతా పునరుద్ధరణ చర్యల్లో ఉన్నందున, అధికారులు సిబ్బంది గురువారం అండేడ్కర్‌కు నివాళులర్పించారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మురళీనగర్: జోన్-2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి కప్పరాడ, ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్లలో ఏఎల్ 59 జీబ్రా కండక్టర్‌ల మార్పిడి పనుల కారణంగా శుక్ర, శనివారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాంజీ ఎస్టేట్, బాపూజీనగర్, కప్పరాడ, జయప్రకాష్‌నగర్, అప్పర్ జయప్రకాష్‌నగర్, తిక్కవానిపాలెం, సంజీవయ్య కాలనీ, సురేష్‌రామ్ నగర్, జగ్జీవన్ నగర్ ప్రాంతాల్లో ఈ రెండు రోజులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

1,029వ రోజుకు ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు దీక్షలు గురువారం నాటికి 1,029వ రోజుకు చేరుకున్నాయి. సంస్థ డబ్ల్యూఆర్‌ఎం-1,2 విభాగ కా ర్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని నిరసన తెలిపారు. వీరికి సంఘీభావం తెలుపుతూ ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, బీహెచ్‌ఈఎల్ నాయకు లు పాల్గొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మా ట్లాడారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకు లు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉక్కు అధికారుల నిరసన

ఉక్కునగరం: జీతాలు అందక ఇబ్బందులు పడుతున్న ఉక్కు అధికారులు తమ సమస్యలపై శుక్రవారం నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.2020 నుంచి పదోన్నతులు జారీ చేయాలని, 2021–22కు పీఆర్పీ చెల్లించాలని, క్వార్టర్లలో విద్యుత్ చార్జీలు సడలించాలని, మూడో పే రివిజన్ అమలు చేయాలని, 2017–19, 2021–22 సంవత్సర వ్యవధికి పెన్షన్ ఫండ్‌కు 9 శాతం జమ చేయాలన్న డిమాండ్లపై ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో పలుమార్లు యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు కనబడలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం డిమాండ్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన ప్రకటించనున్నారు.

10న విభాగాధిపతులకు డిమాండ్ల పత్రాన్ని అందజేయనున్నారు. అదే విధంగా ఈనెల 16న హిల్‌టాప్ కూడలి వద్ద ఉన్న కొవ్వొత్తు జంక్షన్ నుంచి ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వరకు మౌన ప్రదర్శన నిర్వహించనున్నామని సీ అధ్యక్షులు కాటం చంద్రరావు తెలిపారు.

9, 10 తేదీల్లో వైజాగ్ కార్నివాల్


కార్నివాల్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ మనోజ్, పూర్వ విద్యార్థులు

సీతమ్మధార: ఈ నెల 9, 10 తేదీల్లో సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ మైదానంలో వైజాగ్ కార్నివాల్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్, ఫాదర్ పి.మనోజ్ తెలిపారు. ఇందులో భాగంగా పూర్వ విద్యార్థుల సంఘం తరఫున వివిధ సేవా కార్యక్రమాలు, స్వర్ణోత్సవ సంవత్సరాన్ని ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. గురువారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కార్నివాల్‌లో పిల్లలు, పెద్దలను అలరించేలా వివిధ కార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు. పిల్లల కోసం వర్క్‌షాప్‌లు, డ్రాయింగ్ పోటీలు, ప్లే జోన్‌లు, పెద్దల కోసం గేమ్ స్టాల్స్, రుచికరమైన ఫుడ్ స్టాల్స్, ఫన్ గేమ్‌లు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈవెంట్‌కు ప్రధాన స్పాన్సర్‌గా సీఎంఆర్ షాపింగ్‌మాల్, సహ సంధ్య మెరైన్స్, వైశ్యరాజు జ్యువెలర్స్, ఆర్‌వీఆర్ ప్రాజెక్టు సంస్థలు వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. విశాఖ ప్రజలు కార్నివాల్‌ను విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ కోరారు. కార్యక్రమంలో జాన్, వెరా ఫెర్నాండెజ్, గోవిందరాజు, జి.పవన్, శివప్రసాద్‌రెడ్డి, డా.ఎన్.మురళీధర్, డా.కె.వరప్రసాద్, ఎస్.వినోద్, ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి


మాట్లాడుతున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మురళీనగర్: జగనన్న ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని 49వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు అన్నారు. అల్లూరి సీతారామరాజునగర్ 1086281 సచివాలయం పరిధిలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి వర్గానికి మేలు కలిగే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కులం, మతం, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయం, వైద్యం, విద్య వంటి రంగాలకు పెద్దపీట వేశారన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా స్వరాజ్య పాలన అందిస్తున్నారని తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను శంకరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రవికుమార్, విశాఖ ఎంసీ డైరెక్టర్ ఐ.రవికుమార్, ఎ.శ్రీనివాసరావు, వార్డు మహిళా సీనియర్ నాయకులు బి.సరస్వతి, వి.కమలకుమారి, మెర్సీ, సచివాలయ కన్వీనర్లు జి.రామకృష్ణ, కె.అప్పారావు, ధవళేశ్వర రావు, ప్రసాద్, పి.నాగరాజు, వార్డు నాయకులు పి.చైతన్య, కె.మున్నా, బి.శంకర్, సిహెచ్.శ్రీను పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

మురళీనగర్: ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న నైపుణ్య కళాశాలలో గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కృష్ణచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. సింధియాలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్(సెమ్స్)లో శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 18 నుంచి 23 ఏళ్ల వయసు కలిగి ఐటీఐలో వెల్డర్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు వెల్డింగ్ కోర్సులో 4 నెలల పాటు ఉచిత శిక్షణతోపాటు ఉచితంగా వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన గ్రామీణ నిరుద్యోగ అభ్యర్థులు విశాఖపట్నం సింధియా జంక్షన్‌లోని సెమ్స్ కేంద్రంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 85006 87750 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

పెదగంట్యాడ: పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్‌అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నత్తిరాజు డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మినిమం పెన్షన్ రూ.9వేలు ఇస్తూ, డీఏను అనుసంధానం చేయాలని కోరారు. పౌరసరఫరాల శాఖ ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేయాలన్నారు.

శ్రీనివాసనగర్‌లో మహా అన్నదానం


అన్నప్రసాదం వడ్డిస్తున్న జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు శ్రీనివాసనగర్‌లో బాల గౌరమ్మ ఉత్సవ కమిటీ నిర్వహిస్తున్న 8వ వార్షికోత్సవ పండగ మహోత్సవాల్లో భాగంగా గురువారం మహా అన్నదానం నిర్వహించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 ఏళ్లుగా ప్రతి ఏటా గౌరమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో శివ, రమణయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.